క్లుప్తంగా

కరాటే గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆస్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి విద్యార్థులకు మంగళవారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. బేసిక్ పంచెస్, హయ్యర్ కటాస్, స్ప్రింగ్, లెగ్ లిఫ్టింగ్, బాడీ బ్యాలెన్స్ వంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు జి.హరీష్‌యాదవ్, ఇంతియాజ్, మంజునాథ్, జాఫర్ సాధిక్, అంజి, అరవింద్‌చారి ఉన్నారు.

కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన



పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. తాజా చట్టాలు నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేలా రూపొందించారని, గొడవలకు పాల్పడకుండా, సామరస్యంగా కలిసి ఉండాలన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మడంలో రోడ్డు భద్రత, కొత్త చట్టాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఆవశ్యకత, నకిలీ విత్తనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు వాటి ఆవశ్యకత, బాల్యవివాహాల గురించి వివరించారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలని, చదువుతోనే వారి భవిష్యత్ బాగుంటుందని తెలిపారు.

'రైతుబీమా'కు దరఖాస్తుల వెల్లువ



పాన్‌గల్: నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీ వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు గడువు విధించారు. గడువు సమీపిస్తుండడంతో రైతులు తమ దరఖాస్తులు అందజేసేందుకు మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రైతు బీమా దరఖాస్తులను ఏఈఓలు క్షుణ్ణంగా పరిశీలన చేసి వాటిని తీసుకుంటున్నారు. దీంతో పాటు దరఖాస్తు చేసే రైతు ఫొటోను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన అవసరం ఉండడంతో దరఖాస్తుల సేకరణలో ఆలస్యం అవుతుందని ఏఈఓలు పేర్కొంటున్నారు.

వైద్యులు లేని పెద్దాస్పత్రి ఎందుకు?

ఖిల్లాఘనపురం: వైద్యులు లేని పెద్ద ఆస్పత్రి ఎందుకోసమని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో కనీసం 10 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. కేవలం ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నామని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే వైద్యులు అవసరమన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఖిల్లాఘనపురం 30 పడకల ఆస్పత్రిపై శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్యనారాయణ, మాదవ్, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు సంఘటిత పోరాటం

పెబ్బేరు రూరల్: మహిళల రక్షణ, అభ్యున్నతికి వనితలు సంఘటితంగా పోరాడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గీత, గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలో సీపీఐ జయమ్మ అధ్యక్షతన జరిగిన జాతీయ మహిళా సమాఖ్య పట్టణ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని.. పోరాటాలతోనే ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొస్తుందన్నారు. మైనర్లు అత్యాచారం చేసి కఠిన శిక్షల నుంచి తప్పించుకుంటున్నారని, ప్రభుత్వాలు వారికి కఠిన శిక్షలు పడే మార్గం ఆలోచించాలని కోరారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని కోరారు. మహిళల అభ్యున్నతి, రక్షణకు 14 డిమాండ్లను అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో మహిళలు జయశ్రీ, భూమిక, శిరీష, వెంకటమ్మ, కల్పన, ప్రవలిక, సునిత, నాగమ్మ, శాంతి ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అడిగే వారేరీ..

అధికారులు ప్రభుత్వ ఆస్తులను తమ సొంత వాటిలా విచ్చలవిడిగా వాడేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది ఒకరు నన్నెవరూ.. అడిగేది అన్నట్లుగా మున్సిపల్ కార్యాలయం నుంచి వైర్ ఏర్పాటు చేసుకుని తన ఎలక్ట్రికల్ స్కూటర్‌కు నిత్యం ఛార్జింగ్ పెట్టడం అలవాటు చేసుకున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఈ చిత్రం చూసి నివ్వెరపోతున్నారు. కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అధికారులు తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

– వనపర్తి

జీపీ, ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు



అమరచింత పోలీస్‌స్టేషన్‌లో కార్మికులు

అమరచింత: జీపీ, ఆశా, కస్తూర్బా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో మంగళవారం ధర్నా చేసేందుకు పిలుపునివ్వడంతో వారిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ధర్నాకు సిద్ధమవుతున్న వారిని ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. సమస్యల పరిష్కారం కోసం ధర్నాకు వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని ఆయా సంఘాల నాయకులు మండిపడ్డారు.

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించేందుకు ఉపక్రమించిన పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పంచాయతీ వర్కర్లను అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కార్మికులు వీరబాబు, వెంకటయ్య, శంకరమ్మ, రాముడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మొక్కలు సంరక్షించాలి



కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని మండలంలోని కనిమెట్ట సమీపంలో గల ఎన్‌హెచ్44 రోడ్డుకు ఇరువైపులా స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి ఎన్‌హెచ్44 అధికారులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడీ హిమాన్షగుప్తా, ఎన్‌హెచ్ఏఐ జీఎం కోటబాబు, సుధీర్‌షాహు, కొత్తకోట సీఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్, ఎన్‌హెచ్44 అధికారులు సంతోష్‌కుమార్, బాలమురుగన్, సతీష్, తేజ, సురేందర్‌రెడ్డి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'గృహజ్యోతి'కి పోటెత్తిన జనం



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించేందుకు బారులు తీరిన జనం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహజ్యోతి దరఖాస్తులు చేసేందుకు మంగళవారం కార్యాలయంలో జనం పోటెత్తారు. గతంలో ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో చాలా మందికి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు వారికి విద్యుత్ బిల్లు జీరో రాకపోవడంతో వారందరూ మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికి అనుగుణంగా పథకం వర్తించని వారందరూ ఎంపీడీఓ కార్యాలయంలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారని కార్యాలయం అధికారులు తెలిపారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుకు సంబంధించిన రశీదుతో పాటు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు, గ్యాస్ బుక్ జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో అందజేస్తే ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి జనం పెద్ద సంఖ్యలో కార్యాలయానికి చేరుకోవడంతో దరఖాస్తులు స్వీకరించే గది ఎదుట జనం బారులు తీరి నిలబడ్డారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాన్‌గల్: ప్రతి వారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగకరమని ఏఓ సాజీద్ రహమాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడిన ప్రసంగాన్ని రైతులు తిలకించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తుందన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సీఎం అన్నారు. వరి పంట సాగు విత్తనాలు ఎంపిక, తెగుళ్ల నివారణకు వాడాల్సిన ఎరువులు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు. మండలంలో రెండవ విడతలో 1,700 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న అధికారులు, రైతులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పర్వతాపురం రైతువేదికలో రెండో విడత రుణమాఫీలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులతో కలిసి తిలకించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వై.శాఖాపూర్‌లో రెండో రోజు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో వైద్య బృందం ఆంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. పాతటైర్లు, సిమెంట్ ట్యాంకులు, డ్రమ్ములు, పాత ఏయిర్‌కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. లార్వాలు చనిపోవడానికి మందులు పిచికారీ చేశారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అనుమానితుల నుంచి రక్తం సేకరించి నమూనాలు ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఎంపీఓ రోజారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ తిరుపతయ్య, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, ఆంటీలార్వా సిబ్బంది గంధం రాజు, గోపాల్‌రెడ్డి, ఏఎన్ఎం దీవెనమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పాత టైర్లలో మందు పిచికారీ చేస్తున్న ఆంటీ లార్వా టీం

మహిళా సంఘాలు ఆర్థిక వృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న మెప్మా కోఆర్డినేటర్ యువరాజు

అమరచింత: మహిళా సంఘాల సభ్యులు పొదుపులో ఆర్థిక వృద్ధి సాధించి తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని, సక్రమంగా సంఘ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలతో పాటు ఆర్పీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆర్పీలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, తమకు కేటాయించిన సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా పొదుపు సంఘాల సమావేశాలను నిర్వహించడంతో పాటు బ్యాంకు ద్వారా రుణం పొంది తిరిగి చెల్లించని వారిని గుర్తించి, వారితో బ్యాంకు రుణం చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిరు వ్యాపారులకు రుణాలను అందిస్తున్నామని, తిరిగి చెల్లించిన వారికి రూ.యాభై వేల రుణాన్ని సైతం బ్యాంకు ద్వారా ఇప్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. వీటిని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకునేలా ఆర్పీలు చొరవ చూపాలన్నారు. మహిళా సంఘాలకు రూ.పది లక్షల రుణం అందిస్తున్నారని వీటి ద్వారా ఉపాధి అవకాశాల కోసం కుటీర పరిశ్రమలను స్థాపించుకొని సామూహిక వ్యాపారాలు నిర్వహించి లాభాలు గడించాలని సూచించారు. దీంతో కుటంబంలో ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉండే గ్రామాలకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, దీనికి ఆయా గ్రామాల ప్రజలకు సహకరించాలని ఏఈ కోరారు.

పాఠశాల ఆవరణలో శ్రమదానం

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం జమీల్ సూచన మేరకు పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్త చెదారం, ఇతర కంప చెట్లను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెప్పిన వెంటనే విద్యార్థి నాయకులు స్పందించి శ్రమదానం ద్వారా ఆవరణను శుభ్రం చేయడంపై పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం విద్యార్థి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తకోట రూరల్: గరిపెల్లి ట్రస్టు, పత్తిపాక ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిపిల్లల సృజనాత్మక కార్యశాలలకు తెలంగాణ వ్యాప్తంగా ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం అమడబాకుల మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, కార్యశాల కన్వీనర్ డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్, కార్యశాల విషయ నిపుణులు రాఘవేంద్రశర్మ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు.

మెస్ చార్జీలు పెంచాలి

కొత్తకోట రూరల్: పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని కుల వివక్షత పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బాగాంధీ పాఠశాలలు, గురుకుల హాస్టళ్లను జిల్లా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తకోట డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు నారాయణ, మనివర్దన్, భీమయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలలో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనం కుండలను నెత్తిన పెట్టుకొని ప్రధాన రోడ్డు వెంట ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయానికి బోనాలతో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కోళ్లు, పొటేళ్లు బలిచ్చి పంటలు బాగా పండాలని, గ్రామాన్ని సల్లంగా చూడాలని గ్రామస్తులు వేడుకున్నారు.



ఉపాధ్యాయురాలికి సన్మానం



గుర్తింపు కార్డులు అందుకున్న విద్యార్థులతో నోడల్ ఆఫీసర్

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఖిల్లాఘనపురం మండలం మానాజీపేట పీఎస్ హెచ్‌ఎంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు రాణిని మంగళవారం పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ, విరమణ తప్పనిసరి అని, విధుల్లో వారు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు.

లీడర్లు బాధ్యతగా వ్యవహరించాలి

తరగతి లీడర్లు బాధ్యతగా వ్యవహరించాలని మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతికి ఒక గ్రూప్ లీడర్‌ను నియమించారు. లీడర్లుగా ఎంపికైన విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేసి వారి విధులు, పాటించాల్సిన బాధ్యతలను వివరించారు. ప్రతి లీడర్ క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు.

గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

పాన్‌గల్: పీహెచ్‌సీకి వచ్చే గర్భిణుల వివరాలను గ్రామాల వారీగా పక్కాగా నమోదు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల వివరాల నమోదు, హై రిస్క్ గర్భిణులను గుర్తించి వారిని పీహెచ్‌సీకి తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. కాన్పు అయ్యే వరకు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం సీజన్ కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, మైథిలి, లారెన్స్, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

స్థానిక పోరులో సంతానం పరిమితిని తొలగించాలి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాన్‌గల్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల పోరులో సంతానం పరిమితిని తొలగించాలని కోరుతూ జిల్లా గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ చంద్రూనాయక్ మాట్లాడుతూ ఒకరు లేదా ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం కలిగిన ఎంతో మంది నాయకులు ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో గత ప్రభుత్వం సంతాన పరిమితిని తొలగించి అందరూ పోటీచేసేలా అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. సంతాన పరిమితి జీఓ జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలకే పరిమితం చేయకుండా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు వర్తింపజేసి అందరూ పోటీచేసేలా చూడాలని, దీంతో పాటు కనీస విద్యార్హత 10వ తరగతిగా నిర్ణయించాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జాత్రునాయక్, రాజ్‌కుమార్, రాజునాయక్, సుధాకర్‌నాయక్, శివనాయక్, రాజునాయక్, బాబునాయక్, నీలేష్‌నాయక్, రమేష్‌నాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన ఇద్దరికి మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి ఒక్కొరికి రూ.2.50లక్షల చొప్పున రూ.5లక్షల ఎల్‌ఓసీలను బాధిత కుటుంబ సభ్యులకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పుల్లారావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కావలి బాలపీరు మెదడు సంబంధిత వ్యాధితో, ఎరుకలి ఈశ్వర్ మెడపై క్యాన్సర్ గడ్డ (కణితి) సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం సాయం చేయాలని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యింది. మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి సాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు మంత్రి జూపల్లికి, గ్రామ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో అనిల్ గౌడ్, 6వ వార్డులో కర్రెన్న, 19వ వార్డులో గౌస్, 15వ వార్డులో జంగం నిరంజన్ మృతి చెందిన విషయాలను ఆయా వార్డుల స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేఘన్న అభయహస్తంలో భాగంగా ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో ఎల్‌ఐసీ కృష్ణ, ద్యారపోగు వెంకటేష్, నందిమల్ల తిరుపతయ్య, శివ చారి, అఖిల్ చంద్ర, యూనుఫ్, బషీర్, మోసిన్ చాంద్, ఫజల్, బాలరాజు గౌడ్, తిరుపతి, యాది, రఘు, చరణ్, రాజు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ప్రస్తుతం మరమ్మతుల కోసం రూ.5.50 లక్షలు నిధులు మంజురయ్యాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కల్లు గీతకార్మిక చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. మంగళవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. వైద్య అధికారి హరినారాయణతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 13 మంది వైద్యులకు గాను డిప్యూటేషన్‌పై ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారని, సిబ్బంది కొరత ఉందని, ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలమైందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వైద్యులు, సిబ్బంది నియామకం, కొత్తభవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, పరమేష్, తులసిరాజ్‌యాదవ్, నల్గొండశ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు పెట్టొద్దు

మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కేశం నాగరాజుగౌడ్ మంగళవారం ఆత్మకూర్‌లోని ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకులను సందర్శించి మేనేజర్లతో మాట్లాడారు. రుణమాఫీ అయిన రైతులందరికీ తిరిగి కొత్త రుణాలను ఇవ్వాలని కోరారు.

కోర్టు రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన....

ఆత్మకూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టు, అయ్యప్ప కాలనీకి రోడ్డు ఏర్పాటు కోసం ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నరేష్‌తో కేశం నాగరాజుగౌడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, తులసీరాజ్ యాదవ్, నల్గొండ శ్రీనివాసులు, నాగేష్, సాయిరాఘవ, గంగ, షంషీర్, రఫీక్, బుచ్చన్న, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, మహిమూద్, దస్తగిరి ఉన్నారు.

డప్పు కళాకారుల డిమాండ్లు నెరవేర్చాలి

ఖిల్లాఘనపురం: డప్పు కళాకారుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని తిర్మలాయపల్లి డప్పు కళాకారుల సంఘం గ్రామ అధ్యక్షుడు దాసు, ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. మంగళవారం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి అలివేలమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో దండోరా ద్వారా సమాచారాన్ని ప్రజలకు చేరవేసే తమను గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 50 ఏళ్ల లోపు డప్పు కళాకారులకు రూ.5 వేల జీవన భృతి, ఆ పై వయసు గల వారికి రూ.3వేల జీవన భృతి ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పంచాయతీ కార్యదర్శి వారికి తెలిపారు,